జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 3-7-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 386 పేజీలు: 4 వెల: రూ.7



## కబ్జా కుతంత్రాలకు..
# న్యాయపీఠం బ్రేక్!

* ఎంఎల్సీ వరుదు కళ్యాణి సహా వారి అనుచరులకు హైకోర్టు ఝలక్ * ధర్మాన టీవీఎస్‌కు ఊరట * గోడౌన్‌పై కుట్ర.. కోర్టు చెంపదెబ్బ! * ధర్మాన టీవీఎస్ వివాదంపై హైకోర్టు తీర్పు
* అధికార దుర్వినియోగంపై తిట్టిపోసిన న్యాయస్థానం!

**శ్రీకాకుళం క్రైం, జూలై 2 (వార్త):** సింగుపురంలోని ధర్మాన మోటార్స్‌కు చెందిన విలువైన గోదాము స్థలాన్ని అక్రమంగా స్వాధీనం చేసుకోవడానికి రెవెన్యూ, పోలీస్ అధికార యంత్రాంగంతో కలిసి కొందరు ఆడిన కుట్రను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తిప్పికొట్టింది. పిటిషన్ నంబరు 12401/2025పై విచారణ జరిపిన జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు.. ధర్మాన ధర్మారావుకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. చట్టప్రక్రియను పక్కనపెట్టి ప్రభుత్వ వ్యవస్థ దుర్వినియోగానికి పాల్పడిందని న్యాయస్థానం తేల్చి చెప్పింది.

### ఆస్తిపై ఆక్రమణ యత్నం.. తప్పు పట్టిన కోర్టు..

ధర్మాన ధర్మారావుకు చెందిన 80 సెంట్ల స్థలాన్ని అధికారుల ఒత్తిడితో ఖాళీ చేయించేందుకు జరిగిన ప్రయత్నాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, టీడీపీకి చెందిన ఓ ముఖ్య నేత అండతో అధికారులు అక్రమ చర్యలకు పాల్పడ్డారని ధర్మాన మోటార్స్ తరఫున పిటిషన్‌లో పేర్కొనగా, కోర్టు తీర్పుతో ఆ ఆరోపణలకు బలమిచ్చినట్లైంది.

'దుష్టచతుష్టయం' వెనుకున్న కుట్ర!

కోర్టు విచారణలో ఓ గూఢచర్యం తెరపైకి వచ్చింది. రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ, రాజకీయంగా ప్రభావం ఉన్న వ్యక్తులు, వ్యవహారాల్లో జోక్యం చేసుకున్న ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అనే వ్యక్తులు ఈ కుట్ర వెనుక ఉన్నట్లు కోర్టు అభిప్రాయపడింది. కేసులో పిటిషనర్లు పేర్కొన్న 12 మంది పేర్లు బయటకు రావడంతో ప్రజల్లో కలకలం రేగింది. వారిలో ప్రభుత్వ అధికారులతో పాటు వ్యాపారవేత్తలు, పాత్రికేయులూ ఉన్నారు.

### కీలకమైన 12 మంది పేర్లు ఇవే:

1. చిలక జయకృష్ణ,2. పుట్ట శాంతామణి, 2 శ్రీనివాస్, 3.గుల్లిపల్లి శివప్రసాద్, 4. గుల్లిపల్లి జగదీశ్వరరావు, 5. వరుదు కళ్యాణి (ఎమ్మెల్సీ), 6. రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ 7.తహసీల్దార్ 8. ఎస్‌హెచ్ఓ 9.ఎస్పీ 10. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో పాటు మరో ఇద్దరు



### ఆస్తి హక్కు ఉల్లంఘనపై కోర్టు స్పష్టత..

పిటిషనర్లు శాంతియుతంగా స్థలాన్ని వినియోగిస్తుండగా, నోటీసు లేకుండా అధికారులు జోక్యం చేసుకోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 300ఏ, ఆర్టికల్ 14లకు విరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది. రామే గౌడ వర్సెస్ ఎంవి నాయుడు కేసును ఉదాహరణగా పేర్కొంటూ, "పొజిషన్‌లో ఉన్న వ్యక్తిని తొలగించాలంటే చట్ట ప్రక్రియ తప్పనిసరి" అని వివరించింది.

### హైకోర్టు తీర్పు ముఖ్యాంశాలు..

ఆస్తిపై శాంతియుత స్వాధీనం పక్కా స్థలాన్ని పిటిషనర్లు గత కొన్నేళ్లుగా వినియోగిస్తుండటం ప్రభుత్వమే అంగీకరించిందని కోర్టు పేర్కొంది. బలవంతంగా తీసుకోవడం చట్ట విరుద్ధమని తేల్చింది. ప్రక్రియ పాటించకుండా చర్యలు నిషేధమని చట్ట ప్రక్రియను తప్పనిసరిగా పాటించాలనీ న్యాయస్థానం పేర్కొంది. పిటిషనర్ల ఆస్తిలో జోక్యం వద్దని, ప్రభుత్వానికి హితవు పలుకుతూ హక్కులను కాపాడాలని ఆదేశించింది.




### అసలు సూత్రధారి ఎవరు?

ఈ తీర్పుతో అధికార దుర్వినియోగం తెరపైకి వచ్చినప్పటికీ, ఈ కుట్ర వెనుక అసలు మేథావులు ఎవరు? అధికారులంతా ఒక్కసారిగా ఇలా ఎందుకు కదిలారు? అనే ప్రశ్నలు ప్రస్తుతం ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. కోట్లు తిరిగే వ్యాపార సంస్థను లక్ష్యంగా పెట్టుకుని ఇలా వ్యవహరించడమేంటని, ఇది కేవలం రాజకీయ ప్రతీకారమేనా, లేక మరేదైనా లాభసాధన ఉందా? అనే అనుమానాలు గట్టిగా వినిపిస్తున్నాయి.



## వంశధార
# నీరు విడుదల

* పూజలు చేసి నీటిని వదిలిన కలెక్టర్, ఎమ్మెల్యేలు

**హిరమండలం/ఎల్ఎన్‌పేట, జూలై 2 (వార్త):** హిరమండలం వంశధార ప్రాజెక్టు గొట్టా బ్యారేజి నుంచి ఎడమ ప్రధాన కాలువ ద్వారా గేట్లు ఎత్తి సాగునీటిని పాతపట్నం, నరసన్నపేట శాసన సభ్యులు మామిడి గోవిందరావు, బగ్గురమణ మూర్తితో కలసి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఉదయం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయ పనులకు రైతులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఎడమ ప్రధాన కాలువ నుంచి సుమారు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు స్పష్టం చేశారు. సాగు నీటి సమస్య లేకుండా శివారు ప్రాంతాలకు అందే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం గొట్టా బ్యారేజ్ నీటి నిల్వలు, ఔట్ ఫ్లో నీటి పారుదలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రవీంద్ర బాబు, బిఆర్ వంశధార ప్రాజెక్ట్ సూపరిండెంట్ స్వర్ణ కుమార్, ఆర్డీవో ఎం .కృష్ణ మూర్తి, నీటి సంఘం అధ్యక్షులు యేళ్ళ నాగేశ్వర రావు, టెక్కలి, నరసన్న పేట బిఆర్ వంశధార ప్రాజెక్ట్ కార్యనిర్వహక ఇంజనీర్లు శేఖర్ బాబు, సీతారాం నాయుడు, డి ఈ సరస్వతి, రైతులు పాల్గొన్నారు.



## వామనుడిగా..
# జగన్నాథుడు

**శ్రీకాకుళం, జూలై2 (వార్త):** జగన్నాథ స్వామి వామన అవతారంలో భక్తులకు బుధవారం కనువిందు చేశారు. జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం నగరంలోని ఇల్లిసిపురంలోని గుండిచా మందిరంలో జగన్నాథ, బలభద్ర, సుభద్రా దేవిలను ఆలయ ప్రధాన అర్చకులు సుభాష్ చంద్ర పండా వామనావతారంలో అలంకరిం చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో అన్నదానానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు బాలు పాణిగ్రాహి ఏర్పాట్లు చేశారు.



## ప్రభుత్వ భూములు..
# కబ్జా

* హెచ్చరిక బోర్డులు సైతం తొలగించిన కబ్జాదారుడు
* ప్రశ్నిస్తే అంతమందిస్తా అంటున్న ఆక్రమణదారుడు
* ఓ డాక్యుమెంట్ రైటర్ అండతో పేట్రేగిపోతున్న వైనం
* తనకు రాజకీయ నేతల అండ ఉందంటూ రెచ్చిపోతున్న కబ్జాకోరుడు

**శ్రీకాకుళం/ఆమదాలవలస, జూలై2 (వార్త):** ఆమదాలవలస మండలం చిన్న జొన్నవలస గ్రామం రెవెన్యూ లో నిర్వాసితుల కోసం రైతుల నుంచి ప్రభుత్వం భూములు కొనుగోలు చేసింది. నిర్వాసితులకు కేటాయించిన స్థలంలోని సర్వేనెంబర్ 121-20 గల భూమిని చిన్న జొన్నవలస గ్రామానికి చెందిన రెడ్డి రాజులు వారి కుమారులు నర్సింగరావు, రెడ్డి అప్పారావు ఆక్రమించేశారు. దీనిపై కొందరు కలెక్టర్‌తో పాటు, తహశీల్దార్‌కు సైతం ఫిర్యాదు చేశారు.




కలెక్టర్ ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించేందుకు తహశీల్దార్ అక్కడ హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటు చేశారు. కొద్ది గంటల్లోనే ఆక్రమణదారులు ఆ బోర్డులను తీసి పారేశారు. రెండు సార్లు ఇలానే



జరగడంతో రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. అయినప్పటీ ఆ ముగ్గురు ఆక్రమణదారులు ఆ స్థలాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకుని పంట సాగుకు సిద్ధమవుతున్నారు. దీన్ని ఎవరైనా నిలదీస్తే తమకు రాజకీయ పలుకుబడి ఉందని, రెవెన్యూ, పోలీసు అధికారులు తమను ఏం చేయలేరని ప్రగల్భాలు పలుకుతున్నారు. అయితే వీరు ఓ డాక్యుమెంట్ రైటర్ అండతోనే పేట్రేగిపోతున్నారన్న గ్రామస్థులు చెబుతున్నారు. ఇకనైనా రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాల్సివుంది.

## ఎరువుల్లేవ్!

**సరుబుజ్జిలి, జూలై 2(వార్త):** వానాకాలం ప్రారంభమై ఆశించిన వర్షాలు కురుస్తున్న తరుణంలో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈసారి వర్షాలు ముందుగానే కురుస్తున్న నేపథ్యంలో రైతులు సాగు చేసేందుకు ఇదే సరైన సమయంగా భావిస్తున్నారు. ఆరుతడి పంటలైన పత్తి, వరి సోయా, మక్కను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. ఆయా పంటలకు అవసరమైన ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసేందుకు అన్నదాతలు సమాయత్తమవుతున్నారు. దీంతో ఫర్టిలైజర్ దుకాణాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు చేస్తున్నారు.



# జంగిల్ క్లియరెన్స్ త్వరితగతిన చేపట్టాలి

**-రూ.97 కోట్ల తాగునీటి పనులపై గ్రామాల వారీగా నివేదిక ఇవ్వండి**

**-క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించాలి**

**-మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**కోటబొమ్మాళి, జులై 2(వార్త):** ఉపాధి హామీ నిధులతో ప్రధాన రహదారులకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నిమ్మాడలోని కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో గ్రామీణ రహదారులు, పంచాయతీరాజ్ శాఖ రహదారులకు ఇరువైపులా పెద్దఎత్తున ముళ్ల పొదలు, ఇతర పిచ్చిమొక్కలు ఉన్నాయని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా వాటిని తొలగించాలని ఆదేశించారు. ఆనంతరం సాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో రూ. 97 కోట్లతో చేపడుతున్న పనులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో అధికారులు స్వయంగా పర్యటించి ఆయా గ్రామాల్లో అవసరమైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు సుధాకర్, రామకృష్ణ, అంజిత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల వ్యవసాయ శాఖలో బదిలీలు సజావుగా జరిగిన సందర్భంగా మంత్రిని వ్యవసాయ శాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.అనిత మంత్రిని కలిశారు.

# గిరిజనుల భూములను రక్షించకపోతే పోరాటాలు ఉధృతం



**మందస, జులై 2(వార్త):** ఆంధ్రా, ఒరిస్సా సరిహద్దు గ్రామాల గిరిజనుల భూములకు రక్షణ కల్పించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శి వర్గ సభ్యుడు కె.మోహనరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గిరిజన సంఘంతో కలిసి సీపీఎం నాయకులు బుధవారం సరిహద్దు గ్రామాలైన దాలసరి, మాణిక్యపట్నం, గుడ్డికోల, మద్దికల్లు గ్రామాల్లో పర్యటించారు. దాలసరి గ్రామస్తులకు గతంలో ఏపీ ప్రభుత్వం ఇచ్చిన డీ పట్టా భూములు ఒడిశా ప్రభుత్వం ఆక్రమించుకొని ఫారెస్ట్ ఆఫీసు, కమ్యూనిటీ భవనం తదితర కార్యాలయాలు నిర్మించిందన్నారు. శ్రీకాకుళం జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సింగుపురం లోని శ్మశానాన్ని, మాణిక్యపట్నంలో భూములు ఒడిశా ప్రభుత్వం ఆక్రమించుకుంద న్నారు. ఈ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి పలుమార్లు తీసుకువచ్చినప్పటికీ, ఎటువంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సమస్యలు పరిష్కారానికి ఈనెల 10న మందస తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని, ప్రజల మద్దతుతో దశల వారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు సవర గురునాథ్, సవర పాల్గొన రావు, సవర పరశురాం, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, సవర తుంబేషు, సవర శశి, సవర బీముడు, సవర సోమేశు, సవర రాజు, సవర డుంబురు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి నిరసనగా లక్ష సంతకాల సేకరణ



**మందస, జులై 2(వార్త):** ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి నిరసనగా లక్ష సంతకాల సేకరణ ఈనెల 5న ఉదయం 9 గంటలకు వజ్రపుకొత్తూరు మండ లం ఒంకులూరులోని కమ్యూనిటీ భవనంలో కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు అధ్యక్షతన నిర్వహించాలని కమిటీ సభ్యులు నిర్ణ యించారు. బాధిత రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ పచ్చని ఉద్దానాన్ని, తీరప్రాంతాన్ని ధ్వంసం చేసే కార్గో ఎయిర్‌పోర్ట్ వద్దని ఎనిమిది నెల లుగా వివిధ రూపాల్లో దశల వారీగా నిరసన ప్రభుత్వానికి తెలియజేస్తూనే ఉన్నా మన్నారు. తమ భూములు కార్గో ఎయిర్‌పోర్ట్ పేరిట కార్పొరేట్ కంపెనీలకు అప్ప గించడానికి ప్రభుత్వం బలవంతంగా భూసేకరణ చేస్తామంటే ఖచ్చితంగా అంగీకరించబోమన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ చొరవ తీసుకుని ఎయిర్ పోర్ట్ నిర్మాణాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అధ్యక్షుడు కొమర వాసు, చీపురుపల్లి సర్పంచ్ జోగి అప్పారావు, దున్న హరికృష్ణ, కొండ తులసీదాస్, పొట్టి రాజు, సుంకర భాస్కరరావు, సుంకర రాజు, గుంటు లోకనాథం, బొండాడ చిన్న అప్పన్న, లైసెట్టి దమయంతి, లైసెట్టి శోభ, యవ్వకుల జగదీశ్వరి, గుంటు రాజు, చిత్ర గున్నయ్య, పొట్టి యరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎచ్చెర్లను విద్యా హబ్‌గా తీర్చిదిద్దాలి



**-విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు విన్నవించిన ఎమ్మెల్యే ఈశ్వరరావు**

**-రాష్ట్ర పర్యటనలో భాగంగా ఎచ్చెర్లకు రావాలని ఆహ్వానం**

**ఎచ్చెర్ల, జులై 2(వార్త):** ఎచ్చెర్లను విద్యా హబ్‌గా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. మంగళవారం ఆయనను సచివాలయంలో ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రణస్థలం మండలంలో డిగ్రీ కళాశాల నిర్మాణం వేగవంతం చేయాలని, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఐఐఐటీ, అంబేద్కర్ యూనివర్సిటీ అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలల విలీనంతో తలెత్తుతున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. లోకేష్‌ను ఎచ్చెర్ల నియోజకవర్గ పర్యటనకు రావాలని ఆహ్వానించారు. వీటిపై ఆయన సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.




## శక్తి యాప్‌పై అవగాహన


**నరసన్నపేట, జూలై 2(వార్త) :** శక్తి టీం టెక్కలి సబ్ డివిజన్ ఎస్ఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో మహిళలు, పిల్లలు రక్షణ, శక్తి యాప్‌పై బుధవారం పోలాకి గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, నరసన్నపేట గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నందు విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. డ్రోన్ సాంకేతిక సహాయంతో నర్సన్నపేట డిగ్రీ కాలేజ్, ఆర్టీసీ కాంప్లెక్స్ మరియు ఆకతాయిలును పట్టుకోవడంతో పాటు బహిరంగ మద్యం సేవించే వారిని అదుపులో తీసుకున్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గిరిధర్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీ కౌన్సెలింగ్ ప్రారంభం



**ఎచ్చెర్ల, జులై 2(వార్త):** రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీకాకుళం ఐఐఐటీలో ప్రవేశానికి కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం నూజివీడులో ప్రారంభమైంది. విద్యార్థులకు టోకెన్ ఇచ్చి కౌన్సెలింగ్ కేంద్రానికి అనుమతించారు. కుల ధ్రువీకరణ, అకడమిక్ ధ్రువపత్రాలు పరిశీలించి ప్రవేశాలు కల్పించారు. ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ రిజిస్ట్రార్ డాక్టర్ అమరేంద్రకుమార్, డైరెక్టర్ ఆచార్య బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ విద్యార్థులకు ప్రవేశపత్రాలు అందజేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 3తో ముగుస్తుందని కన్వీనర్ అమరేంద్రకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్జీయూకేటీ అధికారులు, సహ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదప్రజలకు 'సీఎం సహాయ నిధి'వరం



**శ్రీకాకుళం టౌన్, జులై 2(వార్త):** విశాఖ ఏ కాలనీలో క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఒక వరమన్నారు. 13 మంది లబ్ధిదారులకు రూ.7,46,851ల చెక్కులను అందించారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు సహాయాన్నందించిన ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జిలు, నగర, మండల, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా విద్యార్థులకు రోటరీ వితరణ

**ఇచ్ఛాపురం, జులై 2(వార్త):** బెల్లుపడ కస్తూర్బా విద్యాలయం బాలికలకు రోటరీ క్లబ్ తరపున 250 పరుపులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పొన్నాడ శిరీష, మాచర్ల రాజ్ కుమార్, తిప్పన మోహన్ వెంకటేష్, అప్పారావు, గోపి, గోపాలరావు, దినేష్, రామకోటి, కృష్ణారావు, జోగారావు, దక్కత కృష్ణమూర్తి రెడ్డి, శ్యామ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నకిలీ మద్యం ప్రమాదకరం

**శ్రీకాకుళం, జులై 2(వార్త):** నకిలీ మద్యం కొనుగోలుతో తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారి సీహెచ్ తిరుపతి నాయుడు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎక్సైజ్ లైసెన్స్ ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచే మద్యం కొనుగోలు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పార్టీలు, వివాహాలు, ఇతర వేడుకల సందర్భాల్లో తక్కువ ధరలకు మద్యం అందిస్తామంటూ కొందరు అనధికార వ్యక్తులు మోసాలకు పాల్పడుతున్నారని, వారు సరఫరా చేసే మద్యం నకిలీ కావచ్చని అధికారులు స్పష్టం చేశారు. అలాంటి మద్యం వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు, కొన్ని సందర్భాల్లో మరణాలు కూడా సంభవించవచ్చని వివరించారు. ఈ తరహా మోసాలకు పాల్పడే అనుమానితుల సమాచారం వెంటనే ఎక్సైజ్ శాఖకు అందించాలని కోరారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నెంబర్ 14405 లేదా డిస్ట్రిక్ట్ ఎక్సైజ్ అధికారి నెంబర్ 9440902332 లో సంప్రదించవచ్చన్నారు.



## మంత్రి అచ్చెన్నకు వినతుల వెల్లువ

**కోటబొమ్మాళి, జులై 2(వార్త):** నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో బుధవారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిర్వహించిన ప్రజాదర్బార్‌కు పెద్ద ఎత్తున వినతులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలను మంత్రికి వివరించారు. గత ప్రభుత్వం వితంతు పింఛన్లు నిలిపివేసిందని, వాటిని మంజూరు చేయాలని పెద్ద ఎత్తున వినతిపత్రాలు అందజేశారు. అతి త్వరలోనే మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. నూతన నివాసం మంజూరు చేయాలని, ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో సాగునీరు అందించాలని కోరారు. సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, బుధవారం నీరు విడుదల చేశామని మంత్రి తెలిపారు. నాలుగు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంచినీటి పథకాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**శ్రీకాకుళం, జులై 2(వార్త):** నైరలో సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మంచినీటి పథకం ద్వారా గతంలో 25 గ్రామాలకు నీటి సరఫరా జరగేదని, దానిని 42 గ్రామాలకు విస్తరించడం జరిగిందని తెలిపారు. మరో 11 గ్రామాలకు నీటి సరఫరా విస్తరించాలని ఆదేశించారు. రక్షిత మంచినీటి పథకం సులభంగా నిర్వహించడానికి వీలుగా పంప్ హౌస్ చుట్టూ రైలింగ్, మెట్లు ఏర్పాటు చేయాలని, పంప్ హౌస్ ఆపరేటర్, ఇతర సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించాలని ఆదేశించారు. గ్రామాలకు నీటిని సరఫరా చేసే పైపులైల మరమ్మత్తులను, ఇతర మరమ్మతులను వెంటనే చేపట్టాలన్నారు. మంచినీటి పథకం పరిశీలించి ఫిల్టర్లకు ఎటువంటి నష్టం లేనివిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రూ.77 లక్షల విలువగల పనులను ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో బి శైలజ, డిప్యూటీ ఎంపీడీవో కే సూర్యనారాయణ, ఆర్డబ్ల్యూఎస్ డీఈఈ, ఏఈఈలు, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, కాంట్రాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, శీర రమణ, అరవల రవీంద్ర, నైరా, అలికాం, బట్టేరు, శిలాగం సింగవలస, బ్రవాను పేట సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ సమావేశానికి మండల శ్రేణులు తరలిరావాలి



**సరుబుజ్జిలి, జులై 2(వార్త):** శ్రీకాకుళం అరసవల్లి రోడ్డులో గల సన్‌రైజ్ హోటల్ లో గురువారం మధ్యాహ్నం 3గంటలకు వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన నిర్వహించే విస్తృత స్థాయి సమావేశానికి వైసీపీ శ్రేణులు తరలి రావాలని సరుబుజ్జిలి మండల అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు కోరారు. మండల ముఖ్య నాయకులు ఎంపీటీసీ లు, సర్పంచులు, అనుబంధ విభాగ అధ్యక్షులు, మండల, యూత్ కమిటీ సభ్యులు తప్పక హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## కదం తొక్కిన ఆటో వాలాలు

**ఇచ్ఛాపురం, జులై 2(వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గస్థాయి ఆటో యూనియన్ సభ్యులు కదం తొక్కారు. ఆటోల ఫిట్‌నెస్ పరీక్షలకు 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎచ్చెర్లకు వెళ్లడాన్ని నిరసిస్తూ లొద్దపుట్టి తులసమ్మ ఆలయం నుంచి స్వేచ్ఛవతి ఆలయం వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. భజరంగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించి అనంతరం ర్యాలీ చేపట్టారు. ఇచ్ఛాపురం టౌన్, రూరల్, బారువా, కొర్లం, కంచిలి, ఎంఎస్ పల్లి, రాజపురం, జడుపుడి, సోంపేట, కవిటి తదితర ప్రాంతాల నుంచి ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



# నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలి

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**హిరమండలం, జులై 2(వార్త):** ప్రజలకు రెవెన్యూ సేవలందించడంలో నిర్దేశించిన లక్ష్యాలను చిత్తశుద్ధితో సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సారవకోట మండలం కల్లట గ్రామంలోని విజయ గార్డెన్స్ కళ్యాణ మండపంలో టెక్కలి డివిజన్‌లోని తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, హెచ్‌డీటీలు, ఆర్ఎస్ డీటీలు, మండల సర్వేయర్లు, వీఆర్‌వోలతో బుధవారం ఆయన డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా ప్రజా సమస్యల పరిష్కార వినతులు, 22 ఏ భూముల వివరాలు, ఇళ్ల స్థలాల రీ వెరిఫికేషన్ తదితర రెవెన్యూ అంశాల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందించడానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. 2 ఏ నిషేధ భూములను గుర్తించి పరిష్కారానికి నివేదిక అందజేయాలని సూచించారు. ఇండ్ల స్థలాల రీ వెరిఫికేషన్‌ను పక్కాగా పూర్తిచేయాలని, ఇళ్ల స్థలాలకు ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నవి, అందుబాటులో ఉన్న భూమి వివరాలను సిద్ధం చేయాలని తహసీల్దార్లకు ఆదేశించారు. రీ సర్వేలో ల్యాండ్ ఎల్‌పీఎం (ల్యాండ్ పాస్ మ్యాప్) గుర్తించి అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ సహాయ కలెక్టర్ డి.పృధ్వీరాజ్‌కుమార్, జిల్లా భూ సర్వే, రికార్డుల నిర్వహణ అధికారి కె.రమేష్, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, కె.ఆర్.ఆర్.సి. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డివిజన్ స్థాయి అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మౌలిక సదుపాయాలు



**-కూటమి ప్రభుత్వం రాకతో గ్రామాల్లో పండుగ వాతావరణం**

**-వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**-పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం**

**కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, జూలై 2(వార్త):** ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం ఆయన కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల పరిధిలోని పలు గ్రామాలకు అనుసంధాన రహదారులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు.

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు**

సంతబొమ్మాళి మండల లక్ష్మీపురం పంచాయితీ పరిధిలో అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ. 4.10 కోట్లతో సీసీ రహదారులకు శంకుస్థాపన చేశారు. జాతీయ రహదారి నుంచి పాతపంచాయతీ భవనం వరకు రూ. 60 లక్షలతో చేపట్టిన సీసీ రహదారి పనును ప్రారంభించారు. తర్లిపేట గ్రామ పంచాయతీ పరిధిలో రూ.53 లక్షలతో నిర్మించిన సీసీ రహదారి ప్రారంభించారు. కాపుగోదాయవలసలో 38 లక్షలతో చేపట్టిన అంతర్గత రహదారులను ప్రారంభించారు. కాపుగోదాయవలస గ్రామ పరిధిలో రూ. 1.65 లక్షలతో చేపట్టే సీసీ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్, రహదారులు, భవనాల శాఖ అధికారులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మూలపేట పోర్ట్ ఘనత జగన్‌దే

**-ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలన్న ధ్యేయంతోనే ఏర్పాటు**

**-అభివృద్ధిపై దృష్టి సాధించకుండా అవాకులు..చెవాకులు పేలొద్దు**

**-అచ్చెన్నాయుడు పై తిలక్ ధ్వజం**

**టెక్కలి, జులై 2(వార్త):** జిల్లా అభివృద్ధి చెందాలనే దృఢ నిశ్చయంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మూలపేట పోర్టు మంజూరు చేసి త్వరితగ తిన పనులు జరిగేలా చర్యలు తీసుకున్నారని, అయితే అచ్చెన్నాయుడు పోర్టు ప్రాంతానికి వెళ్లి జగన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తూ మతిభ్రమించి మాట్లాడుతు న్నారని వైసీపీ ఇన్చార్జి పేరాడ తిలక్ అన్నారు. బుధవారం ఆయన టెక్కలిలో విలేఖరులతో మాట్లాడారు. కంపెనీతో అచ్చెన్నాయుడుకు వాటాలు తేలే వరకు పనులు నిలుపుదల చేయించారని ఆరోపించారు.

టెక్కలిలో రౌడీషీటర్లతో పాలన చేస్తూ.. దొంగ నోట్లు మాఫియా చేస్తున్న వారితో జట్లు వేసుకుని తిరుగుతు న్నారని ఆరోపించారు. ఏడాదిలో ఏం చేశారని ప్రజల ముంగిటకు వెళ్తున్నారు...జగన్ ఇచ్చిన పథకాలు కోత వేసి...మీరు చెప్పిన సూపర్ సిక్స్ ఇవ్వ కుండా మోసం చేస్తున్నారు...దమ్ముంటే ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, జులై 2(వార్త):** "జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాలు 2025" ఎంపికకు ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్యా కమిషనర్ కోరారు. ఆసక్తి గల ఉపాధ్యాయులందరూ https://nationalaward-stoteachers education.gov.in/Login aspxలో పూర్తి వివరాలతో నమోదు చేసుకోవాలని సూచించారు. తమ దరఖాస్తులను సంబంధిత మండల ఉప విద్యాశాఖాధికారి /మండల విద్యాశాఖాధికారి ద్వారా ఈ నెల 15లోగా సమర్పించాలన్నారు.

## 14582 ఉద్యోగాల భర్తీకి స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల

**శ్రీకాకుళం, జులై 2(వార్త):** స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్సీ) 14582 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అర్హతలు, ఫీజు, దరఖాస్తు విధానం మొదలైన వివరాల కోసం అభ్యర్థులు https://ssc.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా మై ఎస్ఎస్‌సి మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

**కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, జూలై 2(వార్త):** వైసీపీ రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చి, విధ్వంసం సృష్టించిందని, కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపిస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం ఆయన కోటబొమ్మాళి మండలంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి గత ఏడాది కాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి,పెట్టుబడులు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకుని, ప్రజలను ఆప్యా యంగా పలకరిస్తూ, కరపత్రాలను ప్రజలకు అందించారు. ప్రతి కుటుంబాన్ని కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని వార్డు నాయకులకు, అధికారులకు సూచించారు. అభివృద్ధిని ప్రతి ఇంటికి చేరవేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఏస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం

### -మంత్రి అచ్చెన్నాయుడు -వాడవాడలా సుపరిపాలన తొలి అడుగు సభలు -పాల్గొన్న ఎమ్మెల్యేలు



**మందస, జులై 2(వార్త):** మందస మండలంలో సుపరిపాలన తొలి అడుగు ప్రారంభ కార్యక్రమంలో భాగంగా బొగాబంద, కొంకడాపుట్టి గ్రామ పంచాయతీల్లో టీడీపీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన పాల్గొని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, అర్హులందరికీ ఇళ్లు, పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. క్లస్టర్ ఇంచార్జి ముంజేటి చంద్రశేఖర్, సాలిన మాధవరావు, రట్టి లింగరాజు, తమిరి భాస్కరరావు, ముడుముంచి నవీన్ కుమార్, కొనారి తులసీ రావు, అడ్డి ఈశ్వరరావు, డోల తిరుపతి, కుదుళ్ల బాలరాజు, సనపల దీనబంద్, జన్ని చలపతి, దొంకురు బాలకృష్ణ, సవర శంకర్, మంగళ పాత్రో, కద్రక హరికృష్ణతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మై టీడీపీ యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయాలని బూత్ కన్వీనర్లకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం, జులై 2(వార్త):** సుపరిపాలనలో తొలి అడుగు అనే కార్యక్రమం విజయవంతం చేయాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు లోపింటి పద్మనాభం అన్నారు. బుధవారం ఆయన గ్రామ దేవత స్వేచ్ఛవతి అమ్మవారి ఆలయ ఆవరణలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దక్కత ఢిల్లీరావు, పెదిన బాబ్జీ, దూపాన సూర్యనారాయణ రెడ్డి, దక్కత కామేష్ రెడ్డి, మేరుగు సూర్యనారాయణ రెడ్డి, గిన్నీ బాలరాజు, సాడి సహదేవ్ రెడ్డి, లోహిదాస్, గణపతి, దుర్యోధన, శ్రీనివాస్ రెడ్డి, ప్రకాష్‌నాయక్, బోర ప్రసాద్, పరశురాం, దుదిష్టి కామేశ్వరరావు, పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.






**సారవకోట, జూలై 2(వార్త):** అడ్డపనసలోని టీడీపీ కార్యాలయంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బుధవారం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంగా చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రం పూర్తిగా నాశనమైందని, ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, నియోజకవర్గ అబ్జర్వర్ కోయిలాడ వెంకటేష్, రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, సురవర తిరుపతిరావు, సాధు చిన్ని కృష్ణనాయుడు, క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌చార్జిలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### సుందర గ్రామంగా మారుస్తాం

### -ఎమ్మెల్యే గొండు శంకర్

**శ్రీకాకుళం రూరల్, జులై 2(వార్త):** ప్రతి గ్రామాన్నీ సుందర గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం నైర పంచాయతీ వెంకటాపురం గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే ఎన్నికల హామీలలో మెజారిటీ అమలు చేసిన ఘనత తమదేనని తెలిపారు. వెంకటాపురంలో రూ.46 లక్షలతో రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించామని, ఏడాదిలోనే సుమారు రూ.80 లక్షలతో అభివృద్ధి పనులకు ఖర్చు చేశామని వివరించారు. సంక్షేమం, అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ శీర రమణయ్య, రూరల్ అధ్యక్షుడు శ్రీనివాస్ బృందం, సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ నేతలు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**పలాస, జూలై 2(వార్త) :** ప్రతి గ్రామాన్నీ సుందరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పలాస నియోజకవర్గ పరిశీలకులు చౌదరి బాబ్జీ అన్నారు. కిష్టపురం పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే ఎన్నికల హామీలలో మెజారిటీ అమలు చేసిన ఘనత తమదేనని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యదర్శి విఠల్, క్లస్టర్ 3 కన్వీనర్ తమ్మినేని గంగారం, యూనిట్ 9 కన్వీనర్ కృష్ణంరాజు, బూత్ 32 కన్వీనర్ నిమ్మడ బాబురావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి సుపరిపాలనలో చేసిన పనులను వివరించి, వారికి ఏమి కావాలో అడిగి తెలుసుకున్నారు.






## మహిళా సర్పంచ్‌లకు సాధికారతపై శిక్షణ

**పలాస, జూలై 2(వార్త):** పలాస మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం , నందిగాం, మెలియాపుట్టి మండలాలకు చెందిన మహిళా సర్పంచ్‌లకు మహిళా సాధికారతపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డిపిఆర్‌సి కోఆర్డినేటర్ పేరాడ ఆనందరావు మాట్లాడుతూ పంచాయతీల పాలన ఏలా చేయాలి, ఎవరితో ఏలా ఉండాలి, అభివృద్ధి ఎలా సాధించాలో మెలకువలు తెలుసుకోవాలన్నారు. ప్రతీ విషయాన్ని అవగాహన చేసుకొని పాలన చేయాలని సూచించారు. ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక స్థానం కల్పిస్తుందని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం డిఆర్‌పిలు జ్యోతి శ్రీనివాస్, కామరాజు, ఎన్ మన్మధరావు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠ రావు, ఎఒ అనురాధ, సీనియర్ అసిస్టెంట్ మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్ఛాపురం పట్టణ తెలుగుయువత అధ్యక్షుడిగా ధర్మరాజు



**ఇచ్ఛాపురం, జులై 2(వార్త):** ఇచ్ఛాపురం గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో జరిగిన పట్టణ తెలుగుదేశం పార్టీ సమావేశంలో మహిళా అధ్యక్షురాలిగా నర్తు ప్రసన్న, ప్రధాన కార్యదర్శిగా నందికి ధనలక్ష్మి, యూత్ ప్రెసిడెంట్ ఆశి ధర్మరాజు రెడ్డి , ప్రధాన కార్యదర్శిగా కోయిల రామారావును ఎన్నుకున్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ క్లస్టర్ ఇన్చార్జిగా ఆశి లీలారాణి, కో క్లస్టర్‌గా కాళ్ల దిలీప్‌యాదవ్‌ని నియమించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు పత్రి తవిటయ్య, ప్రధాన కార్యదర్శి నందిగాం. కోటేశ్వరరావు, కాళ్ల ధర్మరావు, నందికి జానీ, కొండ శంకర్ రెడ్డి, జన్నెల సంతోష్, సుభాష్ రౌలో, రంగాల శ్రీను, శాసన శేఖర్, ఆసి మోహన్, బత్తిన కృష్ణయ్య, బుగత జగన్, దట్టి శ్రీను, పైల నారాయణ, ఎస్ ఎన్ పండా తదితరులు పాల్గొన్నారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

## వైసీపీ జిల్లా సమావేశానికి తరలి రండి



**పలాస, జూలై 2(వార్త):** శ్రీకాకుళంలో గురువారం జరగనున్న వైయస్సార్సీపి జిల్లాస్థాయి సమావేశానికి పలాస నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలిరావాలని వైయస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు కోరారు. బుధవారం ఆయన పలాసలో మీడియాతో మాట్లాడారు. కార్యకర్తలు, యువత, వైఎస్ఆర్సీపీ మహిళా విభాగం , అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

## అలరించిన కూచిపూడి నృత్యాలు

**ఇచ్ఛాపురం, జులై 2(వార్త):** వీరా పంచమి శుభసందర్భంగా జగన్నాథ స్వామి గుండీచ ఆలయ ప్రాంగణంలో సుమారు 45 మంది చిన్నారులు ప్రదర్శించిన నాట్యాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. డాన్స్ టీచర్స్ కావ్య, శైలు, పూజ జయ, శ్వేత, లక్ష్మీ, చిన్నారులు లిఖిత, సింధు, పల్లవి, ప్రీతి, దీపిక, మధుశ్రీ , రమ్యశ్రీ, జైత్రి, ప్రణవి, స్రవంతి, సంజన, నిహారిక, శ్రీ దీక్షిత, తనుశ్రీ, రమ్య , శోభన, సాయి అక్షిత , ధరణి వర్మ, శ్రావ్య ,విద్య ,మౌనిక ,అలేఖ్య, శ్రీని, రేష్మ , జాహ్నవి, జ్వాల, డిల్లేశ్వరి, అంకిత, జెస్సికా, హారిక, సౌమ్య, సాన్విక, నిషా, ప్రజ్వలిత ఈ నృత్యాలను ప్రదర్శించారు. జగన్నాథ స్వామి ఆలయ ఈవో బెండి రామారావు, ఆలయ అర్చకులు కమిటీ బృందం నాట్య గురువు శృతి పట్నాయక్‌ను ఘనంగా సత్కరించి, చిన్నారులకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## గిరిజన గ్రామాలలో స్టేట్ సిఇయస్ బృందం పర్యటన

**కొత్తూరు, జూలై 2 (వార్త):** మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలను సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ బృందం బుధవారం పర్యటించింది. డి. చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ వెరిఫికేషన్‌లో భాగంగా, 20మంది రైతులతో ముఖాముఖి సంభాషించారు. రైతుల ప్రస్తుత ఆర్థిక, సామాజిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఏ రకమైన రసాయన ఎరువులు, పురుగు మందులు వాడుతున్నారు, వాటికి అయ్యే ఖర్చులు ఎంత అనే విషయాలపై వివరాలు సేకరించారు.రైతులు ఎంత విస్తీర్ణంలో ఏ ఏ పంటలు సాగు చేస్తున్నారు, అలాగే ఏ ఏ అంతర పంటలు వేస్తున్నారు అనే అంశాలపై సమాచారం తెలుసుకున్నారు.పసుపులో అంతర పంటలు, 25 రోజుల వయస్సు గల నవధాన్యాలు సాగు చేస్తున్న క్షేత్రాలను బృందం పరిశీలించింది.ఈ కార్యక్రమంలో బృందం నుండి డి. చక్రవర్తి, మురళి, హరికృష్ణ, సూర్యనారాయణ, జగన్, ధనలక్ష్మి, వెంకటరావులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## మందస ఏటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు బదిలీ



**మందస, జులై 2(వార్త):** ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ శాఖలో అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి మేడిద శ్రీనివాసరావుకు బదిలీ అయ్యింది. ఈ మేరకు ఆయన మందస ఏటీడబ్ల్యూఓగా రిలీవ్ అయ్యారు. ఏడు సంవత్సరాలకు పైగా మందస ఏటీడబ్ల్యూఓగా పని చేసిన శ్రీనివాసరావుకు అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరికి బదిలీ అయింది. మంచి అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. దీంతో సీతంపేట ఐటీడీఏ అధికారులు ఆయనకు డీటీడబ్ల్యూఓ, డిప్యూటీ డైరెక్టర్, ఎఫ్ఎసీ, ఇన్చార్జి బాధ్యతలను అప్పగించారు. మన్యంజిల్లా ఏర్పాటు అనంతరం కూడా ఆయన మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు అధికారిగా పని చేశారు. వివాదరహితునిగా గుర్తింపు తెచ్చుకున్న ఆయనకు ఏటీడబ్ల్యూఓ కార్యాలయం సిబ్బంది, ఐటీడీఏ సిబ్బంది, ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్లు, సిబ్బంది అభినందనలు తెలిపి, వీడ్కోలు పలికారు.

## మందస ఏటీడబ్ల్యూఓగా మల్లికార్జునరావు బాధ్యతలు



**మందస, జులై 2(వార్త):** ఐటీడీఏలోని ట్రైబల్ వెల్ఫేర్ శాఖ అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిగా ఎం.మల్లికార్జునరావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఏటీడబ్ల్యూఓ ఎం.శ్రీనివాసరావుకు బదిలీ కాగా, ఆయన స్థానంలో మల్లికార్జునరావును ఐటీడీఏ సీతంపేట యంత్రాంగం ఏటీడబ్ల్యూఓగా నియ మించింది. ఈ ప్రాంతం, ఆశ్రమ పాఠశాలలపై మల్లికార్జునరావుకు మంచి పట్టు ఉంది. ఈ ప్రాంతంలో ఆయన పని చేశారు. ఉత్తమ అధికారిగా గుర్తింపు తెచ్చు కున్న మల్లికార్జునరావు హయాంలో గిరిజన ఆశ్రమాలు అభివృద్ధి చెందుతాయని గిరిజనులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన మల్లి కార్జునరావుకు కార్యాలయం సిబ్బంది, ఆశ్రమాల ఉద్యోగులు, సిబ్బంది ఆహ్వానం పలికి, అభినందనలు తెలిపారు. కాగా, మందస ఏటీడబ్ల్యూఓ కార్యాలయం పరిధిలో మందస, సోంపేట, కంచిలి, నందిగాం, టెక్కలి మండలాల్లో గల 13 ఆశ్రమాలు, ఐదు పీఎంహెచ్ హాస్టల్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా ఏటీడబ్ల్యూఓ మల్లికార్జునరావు మాట్లాడుతూ తన బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహిస్తానని, అవినీతి, అక్రమాలను సహించబోనన్నారు. ఉన్నతాధి కారుల సహకారంతో ఆశ్రమాలను అభివృద్ధి బాటలో పయనింపజేస్తానన్నారు.

## జగన్.. చీడపురుగు

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**టెక్కలి/సంతబొమ్మాళి, జూలై2 (వార్త):** జగన్ అనే చీడపురుగును రాష్ట్రంలో లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం సంత బొమ్మాళి మండలం కాపుగోదాయవలసలో సుపరిపాలనలో తొలి అడుగు కార్య క్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీ యాలకు అర్హత లేని జగన్ లాంటి వ్యక్తి రాష్ట్రంలో ఉండకూడదన్నారు వైకాపా హయాంలో విధ్వంసకర పాలన సాగిందని విమర్శించారు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లాంటి సమర్థ వంతమైన నాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమానంగా పరుగులు పెడుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వైకాపా నాయకులకు కనపడటం లేదా? అని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ప్రజలకు స్వేచ్ఛ లేదని పరిస్థితి చూశామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు స్వేచ్ఛ వచ్చిందని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో పెట్టుబడిదారులు రాష్ట్రం విడిచి వెళ్లారని ఆరోపించారు. చంద్రబాబు నాయుడుపై నమ్మకంతో రాష్ట్రంలో. రూ. 10 లక్షలు పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని పేర్కొన్నారు.

## కొత్తూరులో ఇంటింటికి సుపరిపాలన

**కొత్తూరు, జూలై 2 (వార్త):** కొత్తూరు మండల కేంద్రంలోని చోడవరపు వీధిలో బుధవారం టీడీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలో చేసిన అభివృద్ధి, సూపర్ సిక్స్ పథకాల అమలు గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షులు అగతముడి మాధవరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకోవడమే సుపరిపాలనలో తొలి అడుగు లక్ష్యమని అన్నారు. ఇది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు, స్థానిక ఎమ్మెల్యే ఎంజీఆర్ సూచనల మేరకు ఈ కార్యక్రమం విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అగతముడి మాధవరావు తో పాటు సీనియర్ టీడీపీ మండల నాయకులు మాతల గాంధీ, అగతముడి అరుణ్ కుమార్, కొత్తూరు సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణరావు, సిహెచ్ రాము, ముగితి కృష్ణ, ముగితి లక్ష్మణ రావులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు అందని పాఠ్య పుస్తకాలు

*** కొందరు ఎంఈఓల నిర్వాకం.. విద్యార్థులకు శాపం * బయట అమ్ముకుంటున్నారన్న ఆరోపణలు**




**శ్రీకాకుళం, జూలై 2 (వార్త):** కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి కంకణం కట్టుకుంటోంది. పిల్లలకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తోంది. కొందరు ఎంఈవోల తీరు వల్ల ఆ పుస్తకాలు బయట మార్కెట్‌కు తరలిపోతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందకుండా పోతోందని తల్లిదండ్రులు, విద్యాకమిటీ బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తోంది. పలాస మండలంలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు 84 పాఠశాలలు ఉండగా ఆయా పాఠశాలలకు వచ్చిన పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసే బాధ్యతలు నిర్వహించారు. వాస్తవానికి. గత ఏడాది 6894 పుస్తకాలు రాగా, ఈ ఏడాది 6772 పుస్తకాలు ఎంఈవో కార్యాలయానికి చేరాయి. వాటిని ఆయా పాఠశాలలకు అరకొరగా పంపిణీ చేసినట్లు విమర్శలు ఉన్నాయి. కొందరు విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందలేదు. దీంతో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ ప్రక్రియ ఆయా హెచ్ఎంలకు తలకు మించిన భారంగా మారింది. ఈవిషయాన్ని మండల విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని హెచ్ఎంలు వాపోతున్నారు. దీంతో సొంత ఖర్చులతో పుస్తకాలు కొనుగోలు చేసుకుంటున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

### ఎంఈవోలు ఏమన్నారంటే..



దీనిపై ఎంఈవో1 శ్రీనివాస రామను వివరణ కోరగా, పాఠ్య పుస్తకాల సంగతి తనకు తెలియదని, ఎంఈవో2 సత్యంను సంప్రదించాలన్నారు. ఎంఈవో2ను సంప్రదించగా గత ఏడాది కంటే ఈఏడాది పిల్లల సంఖ్య తగ్గిన మాట వాస్తవమేనన్నారు. కొన్ని పుస్తకాలు మిగిలాయని, వాటిని ఆయా పాఠశాలల నుంచి తిరిగి రప్పించి. ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని తెలిపారు. అయితే అసలు సమాధానాన్ని దాటవేశారు.




## వైద్యులను తక్షణమే విడుదల చేయాలి

### మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు




**పలాస, జూలై 2(వార్త):** అరెస్ట్ చేసిన వైద్యులను తక్షణమే విడుదల చేయాలని, విజయవాడలో వైద్యులపై పోలీసుల జులం ప్రదర్శించి డాక్టర్స్ డే రోజున వైద్యుల గొంతునొక్కడం హేయమైన చర్య అని, విదేశాలలో వైద్య విద్యను పూర్తి చేసుకుని అన్ని అర్హతలు సాధించిన రాష్ట్రంలోని యువ వైద్యులకి కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. అటువంటి వారి కోసం తక్షణం పర్మినెంట్ రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. పలాసలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం డాక్టర్స్ డే రోజున విజయవాడలో నిరసన తెలిపిన విదేశీ విద్యనభ్యసించిన వైద్యుల గొంత నొక్కే ప్రయత్నాన్ని కూటమి ప్రభుత్వం చేయడం సరికాదన్నారు. యువ వైద్యులపై పోలీసులు దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. అరెస్ట్ చేసిన వైద్యులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విదేశాల్లో వైద్య విద్యను పూర్తి చేసుకుని ఎంసిఐ నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణలై, ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న యువ వైద్యులకి రాష్ట్రంలో పర్మినెంట్ రిజిస్ట్రేషన్ చేయకుండా నిలిపివేయడం దారుణమని మండిపడ్డారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఏ కారణం చెప్పకుండా ప్రభుత్వం పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నిలిపివేయడం పట్ల ధ్వజమెత్తారు. వృత్తి పరంగా యువ వైద్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఈ ప్రభుత్వానికి పట్టడం లేదని అగ్రహం వ్యక్తం చేసారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వైద్య రంగ అభివృద్ధికి జగన్మోహన్ రెడ్డి ఎంతో కృషి చేసారన్నారు. ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు కొత్తగా మెడికల్ కళాశాలల ఏర్పాటుకి చర్యలు తీసుకున్నారన్నారు. కొత్తగా మెడికల్ సీట్లు రాష్ట్రానికి వచ్చేలా కూడా చొరవ చూపించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ కళాశాల పనులను అడ్డుకుని సీట్లు పెరగనీయకుండా చేస్తుందన్నారు. కేంద్రం ఇచ్చిన సీట్లను కూడా తిరస్కరించిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలని ఆయన కోరారు. తక్షణమే యువ వైద్యుల డిమాండ్లు పరిష్కరించాలని, అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని, యువ వైద్యుల పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని మాజీ మంత్రి అప్పలరాజు కోరారు.

## ఎయిర్ పోర్టు పనుల్లో వేగం పెంచిన సర్కార్

### అడ్డుకుంటున్న ఉద్దానం ప్రజలు

### ఇతర రాష్ట్రాల నుంచి చేరుతున్న యంత్రాలు, సిబ్బంది

**మందస, జులై 2(వార్త):** మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో ప్రభుత్వం నిర్మించతలపెట్టిన కార్గో ఎయిర్ పోర్టు పనులను వేగం పెంచింది. ఓ వైపు రైతులు, ఉద్దానం ప్రజలు ఎయిర్ పోర్టు నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. భూములు ఇవ్వమని తేల్చి చెబుతుండగా, మరో వైపు చాపకింద నీరులా ఎయిర్ పోర్టు నిర్మాణ పనులకు అవసరమయ్యే సామాగ్రి, సిబ్బందిని ఆయా ప్రాంతాలకు తీసుకువస్తోంది. ఇతర రాష్ట్రాలను నుంచి ఒక్కొక్కటిగా ఉద్దానానికి చేరుకుంటు న్నాయి. మహారాష్ట్ర నుంచి నిర్మాణపనులకు సంబంధించిన యంత్రాలు, సిబ్బంది సంఘటనా స్థలాలకు చేరాయి. ఇప్పటికే సర్వే చేస్తున్న సిబ్బంది ఉద్దానం ప్రజలు అడ్డుకోగా.. పోరాటం ఉధృతం చేయడానికి సన్నహాలు చేస్తున్నారు. ఎయిర్ పోర్టునకు వ్యతిరేకంగా లక్ష సంతకాల సేకరణను ఉద్దానంలో చేపట్టనుండగా, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ తయారు చేసుకుంటోంది. మందస, వజ్రపుకొత్తూరు, పలాస మండలాల బాధితులు, రైతులు, ప్రజా సంఘాలు ఈ పోరాటానికి మద్దతు పలుకుతున్నాయి. ప్రజలను చైతన్యం చేస్తున్నాయి. కాగా.. ఉద్దానం చేరుకున్న సిబ్బంది, సామాగ్రిని అడ్డుకోవడానికి రైతులు ప్రయత్నించడంతో పోలీసులు చేరుకుని, రైతులతో చర్చలు జరిపారు. పోలీసులు రైతులకు సర్ది చెప్పారు. శాంతియుతంగా, చట్టబద్ధంగా ఉండాలన్నారు. ఇరువర్గాల మధ్య వివాదాలు, గొడవలు వద్దని హితవు పలికారు. ఏమైనా జరిగితే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.




## రోడ్డు ప్రమాదంలో జనసేన నేత నేతాజీ మృతి

### కన్నీరుమున్నీరవుతున్న కుటుంబీకులు

**మందస, జులై 2(వార్త):** సరిగ్గా రెండు నెలల క్రితం వివాహం జరిగిన ఓ నవ వరుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. వివరాలల్లోకి వెళితే.. మందస మండలంలోని పిడిమందస పంచాయతీ మధ్య గ్రామానికి చెందిన గై నేతాజి(28) కుటుంబాన్ని పోషించడానికి ఇతర ప్రాంతాలకు వలస కూలీగా వెళ్లి పని చేస్తున్నాడు. నేతాజీ చిన్నతనంలోనే తండ్రి ప్రకాష్ పొలంలో పని చేస్తుంగా హటాత్తుగా మరణించడంతో కుటుంబ భారం తల్లి పార్వతిపై పడింది. అనంతరం కుటుంబ భారాన్ని మోస్తున్న నేతాజీ జనసేన పార్టీలో కీలకంగా మారారు. మండల స్థాయిలో కూడా గుర్తింపు తెచ్చుకున్నారు. 2025 ఏప్రిల్లో పలాస మండలంలోని గోదావతి గ్రామానికి చెందిన మాధురితో వివాహం జరిగింది. సొంత పనుల దృష్ట్యా తల్లితో ద్విచక్రవాహనంపై ఒడిశాలోని పర్లాకిమిడి నేతాజీ వెళ్తున్న సమయంలో ప్రైవేటు బస్సు వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది.



పర్లాకిమిడి వద్ద జరిగిన ఈ ప్రమాదంలో నేతాజీతో పాటు తల్లి పార్వతి కూడా తీవ్ర గాయాలకు పాలయ్యారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న నేతాజీ శ్రీకాకుళంలో మరణించారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. నేతాజీ మృతదేహాన్ని చూసిన కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాళ్ల పారాణి కూడా ఆరని నవ వధువు మాధురి రోదనను ఆపడం ఎవరి తరమూకాలేదు. మంచివాడిగా గుర్తింపు తెచ్చుకున్న నేతాజీ మరణంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546